## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

జన్నారం: మండలంలో కలమడుగు గ్రామంలోని నరనారాయణ స్వామి ఆలయం 39వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం నరనారాయణ, ఆంజనేయస్వామి ఆలయాల్లో పలువురు దంపతులు పూజలు చేశారు. ఆలయ పూజారి రాజనచంద్రశర్మ, కాకర నర్సయ్యశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, 145 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం కలమడుగు పాఠశాల 2007 పదో తరగతి పూర్వ విద్యార్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరి స్వదేశ్‌కుమార్, సభ్యులు విష్ణుమూర్తి, రంగయ్య, అంజగౌడ్, శంకరయ్య, శ్రీనివాస్, అంజన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆఖరి సఫర్ వాహనాన్ని ప్రారంభించాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ హఫీజా బేగం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి పట్టణ ప్రగతి నిధులు దాదాపు రూ.44 లక్షలతో కొనుగోలు చేసిన ఆఖరి సఫర్(అంతిమయాత్ర) వాహనాన్ని ప్రారంభించాలని 18వ వార్డు కౌన్సిలర్ హఫీజా బేగం కోరారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు శుక్రవారం వినతిపత్రం అందించారు. వాహనాన్ని కొనుగోలు చేసి మూడు నెలలు అయిందని, ఇప్పటికైనా ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు.

### డ్రెయినేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

జైపూర్: మండలంలోని ఇందారంలోని 11వ వార్డు ఎస్టీ కాలనీలో శుక్రవారం డ్రెయినేజీ నిర్మాణ పనులు ఇందారం–2 ఎంపీటీసీ ఆర్కే స్వర్ణసంతోశ్ యాదవ్ ప్రారంభించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5 లక్షలతో పనులు చేపట్టినట్లు ఎంపీటీసీ తెలిపారు. స్థానిక నాయకులు చేద మహేందర్, మూట లక్ష్మణ్, పూజారి గంగన్న, మీనుగు దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మందమర్రికి తరలిన బీజేపీ నేతలు



తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

భీమారం: బీజేపీ ఆధ్వర్యాన మందమర్రిలో శుక్రవారం నిర్వహించిన విజయసంకల్ప యాత్రకి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గౌతంరెడ్డి, మండల ఇన్‌చార్జి ఆలం బాపు, బీజేవైఎం మండల నాయకులు కొమ్ము కుమార్, మహిళా అధ్యక్షురాలు పెద్దపల్లి వనిత తదితరులు వాహనాల్లో వెళ్లారు.

### 25 నుంచి అతిరుద్ర మహాయాగం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహానంద సినిమా థియేటర్ సమీపంలో ఈనెల 25 నుంచి మార్చి 1 తేదీ వరకు అతి రుద్ర మహాయగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురోహితులు భరద్వాజ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరుకావాలని కోరారు.

### కళ్లద్దాల పంపిణీ

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 66 మంది విద్యార్థులకు ఇటీవల తాళ్లపేటకు చెందిన కంటి వైద్యుడు గుమ్మడి కిరణ్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 20 మందికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారందరికి కిరణ్ తన సొంత ఖర్చులతో కళ్లద్దాలుఅందించారు. పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు శుక్రవారం వీటిని పంపిణీ చేశారు.

# తల్లుల వనప్రవేశం

- ముగిసిన సమ్మక్క–సారలమ్మ జాతర
- అమ్మవార్లకు మొక్కు చెల్లించుకున్న భక్తులు



సీసీసీలో సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట–నమ్నెపల్లి శివారులోని బుగ్గగట్టు వద్ద మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ జాతర వైభవంగా జరుగుతుండగా శుక్రవారం అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగిసింది. బుధవారం సారలమ్మ ప్రతిష్ఠించగా, గురువారం సమ్మక్క తల్లి గద్దెపైకి చేరింది. శుక్రవారం గోవిందరాజులు, పగిడిద్దరాజులు కొలువుదీరి ఉండటంతో భక్తులు అధికసంఖ్యలో చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. హాజీపూర్ జెడ్పీటీసీ దంపతులు పూస్కూరి శిల్ప–శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తుండగా భక్తులు అమ్మవార్లకు మేకలు, కోళ్లతోపాటు తమ ఎత్తు బంగారం (బెల్లం) తూకం వేశారు. అనంతరం అమ్మవార్లకు మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవార్లను వన ప్రవేశం చేయించడంతో జాతర ముగిసినట్లు మేడారం నుంచి వచ్చిన కోయ పూజార్లు ప్రకటించారు. జెడ్పీటీసీ శిల్ప–శ్రీనివాస్ దంపతులు వారిని నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు.

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల సమీపాల్లో సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్ద జాతర శుక్రవారంతో ముగిసింది. భక్తులు గద్దెల వద్దకు వచ్చి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ పూజార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క–సారలమ్మకు భక్తులు బెల్లం, ఇతర తీపి నైవేద్యాలు వండి ఆరగించారు.

వేమనపల్లి: మంగెనపల్లి ప్రధాన రహదారిపై కొలువై ఉన్న సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద శుక్రవారం బోనాలు సమర్పించారు. ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షాబీర్ ఆలీ, మాజీ సర్పంచులు, నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు. చివరి రోజు మంగెనపల్లి, దస్నాపూర్, వేమనపల్లి, రాజారాం గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి తల్లి గద్దెల వద్ద బోనం వండారు. బోనాల కార్యక్రమంతో జాతర ముగియనుంది.



హాజీపూర్‌లో సమ్మక్క–సారలమ్మలను వనప్రవేశం చేయిస్తున్న కోయ పూజార్లు

నస్పూర్: పట్టణంలోని సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతోంది. గద్దెలపై కొలువు దీరిన వనదేవతల వద్ద శుక్రవారం భక్తులు పూజలు చేశబూరు. నేడు వన దేవతల వన ప్రవేశంతో జాతర ముగియనుంది.



నూతనవస్త్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ శిల్ప–శ్రీనివాస్ దంపతులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో సమ్మక్క–సారలమ్మను సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. జాతరలో భాగంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ న్యాయవాదులు కిరణ్, సుమన్, భక్తులు, నిర్వాహకులు ఉన్నారు.



లక్సెట్టిపేట: మొక్కు చెల్లించుకుంటున్న జడ్జి అర్పితమారం రెడ్డి



వేమనపల్లి: గద్దెలను దర్శించుకుంటున్న ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు



చెన్నూర్ మండలం సుబ్బరాంపల్లిలో మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

## పాఠశాలల్లో మాక్ జెడ్పీ సమావేశం




దండేపల్లి: సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు



జన్నారం: సమావేశంలో విద్యార్థులు

దండేపల్లి/జన్నారం: డీఈవో ఆదేశాల మేరకు దండేపల్లి మండలం వెల్గనూర్ జెడ్పీ ఉన్నత, జన్నారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మాక్ జెడ్పీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు జెడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, మంత్రులు, సీఈవో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీటీసీ సభ్యులుగా వ్యవహరించారు. సమావేశంలో సురక్షిత జాతర, సమ్మక్క–సారలమ్మ జాతర అనే అంశాలపై చర్చించారు. జాతరలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. హెచ్‌ఎంలు విజయలక్ష్మి, కొండు జనార్దన్, ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధ్వాన రోడ్డు



జోడువాగులు సమీపంలో చెన్నూర్ వైపు వెళ్లే దారిలో రోడ్డు దుస్థితి

- జోడువాగులు వద్ద రహదారిపై గుంతలు
- రాకపోకలకు ఇబ్బందులు
- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే ప్రధానదారిలో జోడువాగులు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు కిలోమీటర్ వరకు రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము వస్తుండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. భీమారం, చెన్నూర్ మండలాల మధ్యలో సుమారు 1.09 కి.మీ రిజర్వు ఫారెస్టు ఉంది. అక్కడ వాగుపై నూతన వంతెన, రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. దీంతో అధ్వానంగా మారిన రోడ్డుపై భారీ వాహనాలు వస్తున్న సమయంలో చిన్న వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితి. అంతేకాకుండా రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చడానికి కంకర పోయించారు. కాని పనులు చేపట్టలేదు. చెన్నూర్ వైపు లింగంపల్లి సమీపంలోని అర్బన్ పార్కు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతతో ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

## భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సారంగపాణి, జిల్లా అధ్యక్షుడు అంబాల రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బీడీపీపీ భూములను అక్రమంగా చదును చేసి ఆక్రమిస్తున్నారని, రాజంపేట శివారులో డంపింగ్ యార్డు పక్కన ప్రభుత్వ భూమిలో వెంచర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అలాగే గుండి రోడ్డు, రవిచంద్ర కాలనీ, అంకుసాపూర్, సామెల శివారులోనూ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నరేశ్, రాజు, సురేశ్, పవన్ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మించరూ..



భీమారం: మండలంలోని లాల్‌బహుదూర్‌పేట నుంచి సుద్దాల గ్రామానికి వెళ్లేందుకు మట్టి రోడ్డే దిక్కయింది. వర్షాకాలంలో రోడ్డు బురదగా మారడంతో స్థానికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లాల్‌బహుదూర్‌పేట గ్రామంలో కూరగాయల సాగుతోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతుంటారు. పండించిన కూరగాయలను విక్రయించడానికి రైతులు ప్రతీరోజు గోదావరిఖని, మంచిర్యాలకు వెళ్తుంటారు. లాల్‌బహుదూర్‌పేట నుంచి భీమారం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, మరో వైపు దూరభారం ఉంది. సమీపంలోని కిష్టంపేట వెళ్లేందుకు వీలుగా సుద్దాల వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. లాల్‌బహుదూర్‌పేట నుంచి 2.5 కి.మీ దూరం ఉన్న సుద్దాల వరకు బీటీ రోడ్డు నిర్మించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యమ నాయకురాలు విజయశ్రీ మృతి



విజయశ్రీ (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నాయకురాలు చల్లగుళ్ల విజయశ్రీ(54) అనారోగ్యంతో మృతిచెందింది. మంచిర్యాలకు చెందిన ఆమె వ్యాపారవేత్తగా సుపరిచితురాలు కాగా, రాజకీయ ప్రవేశంలో భాగంగా కాంగ్రెస్‌లో చేరారు. ఆపై రాష్ట్ర సాధన ఉద్యమం ఊపందుకోవడంతో జేఏసీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వివిధ నిరసనలు చేపట్టగా ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. టీఆర్‌ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. తిరిగి బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా గురువారం రాత్రి అస్వస్థతకు గురై ఇంట్లో మృతి చెందారు. శుక్రవారం ఆమె పార్థివదేహం వద్ద ఉద్యమకారులు, ప్రజా, కుల సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, క్రిస్టియన్ సంఘాలు, పాస్టర్లు హాజరై నివాళులర్పించారు.

## సోమనపల్లిలో నగర సంకీర్తన

చెన్నూర్‌రూరల్: జై శ్రీమన్నారాయణ రామానుజ శ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి వారి మంగళశాసనములతో సమతా ఆధ్వర్యంలో మండలంలోని సోమనపల్లి గ్రామంలో శుక్రవారం నగర సంకీర్తన చేపట్టారు. ఇందులో భాగంగా బియ్యం గింజలు సేకరించారు. వికాస తరంగ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన చేస్తున్న మహిళలు

# 'చెత్త'శుద్ధి కరువు

- వార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- దుర్గంధంతో స్థానికుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ బ్రాహ్మణవాడలో రోడ్లకు ఇరువైపులా ముళ్లకంప

చెన్నూర్: మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేసింది. చెత్తశుద్ధిపై పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి కరువైంది. వార్డులు, కాలనీల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలతో దర్శనమిస్తోంది. భరించలేని దుర్వాసన రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో 25,347 మంది జనాభా ఉండగా 18 వార్డులు ఉన్నాయి. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి చెత్త తొలగించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీల్లో చెత్త పేరుకుపోయిందని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పర్యటనల సందర్భంగా ప్రధాన రోడ్లు శుభ్రం చేయించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వాపోతున్నారు.

### రోడ్లకు ఇరువైపులా ముళ్లకంపలు

పద్మశాలివాడ నుంచి రౌండ్ హనుమాన్ టెంపుల్‌కు వెళ్లే దారిలో పెరిగిన ముళ్ల కంపలు తొలగించడం లేదు. దీంతో కాలనీల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో పాములు సంచరిస్తున్నాయని పేర్కొంటున్నారు.

### తగ్గిన చెత్త వాహనాలు

మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత 16 చెత్త వాహనాలతోపాటు రెండు ట్రాక్టర్లతో మొత్తం 18 వాహనాలు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 10 చెత్త వాహనాలు, రెండు ట్రాక్టర్లు, ఒక్క టాటాఏస్ మాత్రమే నడుస్తున్నాయి. మరో ఐదు వాహనాలు మూలనపడ్డాయి. గతంలో ఈ వాహనాల్లో డ్రైవర్‌తోపాటు పారిశుధ్య కార్మికుడు రావడంతో ఇళ్లలోని చెత్తతోపాటు కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రస్తుతం ఒక్క డ్రైవర్ మాత్రమే పంపిస్తుండడంతో రెండు రోజులు ఒక్క కాలనీ చొప్పున ఇళ్లలో చెత్తను తీసుకెళ్తున్నారని మహిళలు తెలిపారు. అధికారులు స్పందించి కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల కంపలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

#### చెత్త తొలగించడం లేదు



గెర్రె కాలనీలో ఎక్కడపడితే అక్కడ చెత్త ఉంది. మున్సిపల్ సిబ్బంది, అధికారులు గెర్రె కాలనీ ఉన్న విషయాన్ని మరిచి పోయారు. మెయిన్ రోడ్లు శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త శుభ్రం చేయించాలి. – గడ్డం సుధాకర్, యువకుడు

#### చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీలో సిబ్బంది రెగ్యులర్‌గా చెత్తను తొలగిస్తున్నారు. పారిశుధ్య పనులను మాత్రం నడుస్తున్నాయి. ముళ్లకంపలు పెరిగితే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – గంగాధర్, మున్సిపల్ కమిషనర్

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీని నెరవేర్చాలని, అడ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెల్లించాలని, మెడికల్ కళాశాలలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని, జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మిగిలిన పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు రాజన్న, దుర్గం దినకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

## యువ కవులకు సన్మానం



సన్మానిస్తున్న నిర్వాహకులు

వాంకిడి: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన మాతృభాష కవి సమ్మేళనంలో పాల్గొన్న మండలంలోని నగర్‌గుట్ట, మోకాసి గూడ గ్రామాలకు చెందిన యువ కవులు ఆత్రం మోతీరాం, కోట్నాక సాయికుమార్‌లు కొలామి, గోండి భాషల్లో కవితగానం చేసి అలరించారు. ఈ మేరకు సాహిత్య అకాడమీ నిర్వాహక అధికారి షణ్ముకానంద్, నాగ మల్లేశ్వర రావు, నిర్వాహకులు మండలానికి చెందిన యువకవులను సన్మానించారు.